T/AP/2025/1017/2082/1372

# ది ఎవిడెన్స్

THE EVIDENCE

డిజిటల్ తెలుగు దినపత్రిక

తేది : 30-8-2026 ఆదివారం | సంపుటి : 1 | సంచిక : 241 | ఎడిటర్ : జి.శ్రీనివాసరావు | విశాఖపట్నం | పేజీలు : 4 | వెల : రూ.1/-

## హిందూ రాష్ట్రమంటే ముస్లింలు లేని భారత్ కాదు

### న్యూయార్క్‌లోని ఓ సదస్సులో భాగవత్

న్యూయార్క్, ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : భారత్ దేశంలో ముస్లింలు ఉండకూదని ఏ హిందువైనా అనుకుంటే, అతడు హిందువే కాదని ఆర్‌ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన 'వన్ వరల్డ్: వన్ హ్యూమానిటీ' సదస్సులో భాగంగా ఆయన మాట్లాడారు. 'హిందూ రాష్ట్రం అంటే ముస్లింలను భారత్ నుంచి తరిమివేయడమా?' అని 2018లో (మిగతా 2వ పేజీలో)

## భక్తజన సందోహంతో కిక్కిరిసిన తిరుమల.. శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం

### తిరుమలలో శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది.

తిరుమల,ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : ఆపదమొక్కులవాడు శ్రీ వేంకటేశ్వరుడి దివ్య సన్నిధి తిరుమల భక్తులతో కిక్కిరిసిపోయింది. వీకెండ్ కావడంతో దేశం నలుమూలల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు జనం తండోపతండాలుగా తరలి వచ్చారు. ఈ మేరకు ఎలాంటి టోకెన్లు లేని భక్తులకు స్వామివారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. కొండపైకి (మిగతా 2వ పేజీలో)

# గిరిజనులకు అండగా సంజీవని

## సంజీవని పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు




అరకులోయ,ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : ఆధునిక సాంకేతికతను ఉపయోగించి మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో 'సంజీవని' ప్రాజెక్టును చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. ఈ ప్రాజెక్టును తొలుత చిత్తూరు జిల్లాలో అమలు చేశామని, ఇప్పుడిక్కడ ప్రారంభించామని, రానున్న 3 నెలల్లో జిల్లాలోని అన్ని ఆస్పత్రులకూ అనుసంధానిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భరోసా, ప్రతి తల్లికీ ధైర్యం, ప్రతి బిడ్డకూ ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. 'అల్లూరి జిల్లా చరిత్రలోనే ఈరోజు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. ప్రకృతి సంపద, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని మరింత చేరువ చేయడమే సంజీవని లక్ష్యం. ఇది ప్రాజెక్టు మాత్రమే కాదు.. గిరిజనుల ఆరోగ్య రక్షణకు భరోసా. ఏఐ, డ్రోన్‌లతో వైద్య సేవలు అందిస్తాం. అలాగే గిరిజన ప్రాంతాల్లో విద్య, తాగునీరు, రోడ్లు, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, ఉపాధి, సంక్షేమ రంగాలను నిరంతరం అభివృద్ధి పథంలో నడిపిస్తాం' అని తెలిపారు. రాష్ట్రాన్ని గత పాలకులు ధ్వంసం చేశారని.. వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎంగా తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనే పెట్టాను. 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తే, ఏడాది తర్వాత దానిపై గొడ్డలి పార్టీ రాద్ధాంతం చేస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలోని మొత్తం టీచర్ పోస్టుల్లో 80 శాతం టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు భర్తీ చేసినవే. గత పాలకులు గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారు. ఆర్డీవో స్థాయి అధికారులను ఎంపిక చేసే పరీక్ష పత్రాలను ఎలక్ట్రీషియన్లు, అటెండర్లతో దిద్దించారు. అలాగే దేవాలయాల ప్రతిష్ఠను దెబ్బతీశారు. బలవంతపు మత మార్పిడులు చేశారు. ఓ మాజీ మంత్రి కోడలు సైతం బయటకు వచ్చి ఇంట్లో జరిగిన విషయాన్ని బయటపెట్టింది. తనను బలవంతంగా మతం మార్చే ప్రయత్నం చేశారని చెప్పింది. గత పాలకులు వాళ్ల పార్టీలో ఉండాలంటే మతం మార్చుకోవాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు. గొడ్డలి పార్టీతో చేతులు కలిపిన సివిల్ సర్వీస్ అధికారులు, పారిశ్రామికవేత్తలు జైలు పాలయ్యారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ఆ పార్టీ నేత కొత్త రాగాలు తీస్తున్నారు. ఎక్కడా ఏకగ్రీవాలు జరగకూడదంటున్నారు. వారి పాలనలో మాత్రం ఏకగ్రీవాలు కావాలన్నారు. అధికారంలో ఉంటే ఒక విధంగా, విపక్షంలో ఉంటే మరో విధంగా మాట్లాడుతున్నారు. కేంద్రంలోనూ, ఏపీలోనూ ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పనిచేస్తోంది. సోమవారం వెలిగొండ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేస్తున్నాం. వచ్చే నెల రెండో తేదీన గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకొస్తున్నాం.

### ఆర్కే నగర్‌వాసులతో మాటామంతీ

గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆర్కే నగర్‌లో 30 మంది సంజీవని లబ్ధిదారుల(డిజిట్ హెల్త్ రికార్డులు కలగినవారు)తో సీఎం సమావేశమయ్యారు. గర్భిణి దివ్యతో, మరో మహిళతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవల గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. వర్షాభావం వల్ల వరి నాట్లు వేయలేకపోయామని దొన్ను అనే రైతు చెప్పగా.. ప్రత్యామ్నాయ పంటల సాగుకు రాజ్‌మా, రాగులు, కందులు మొదలైన విత్తనాలు సరఫరా చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. కాఫీ తోటలు ఎంతమందికి ఉన్నాయి.. అంతర పంటగా మిరియాలు వేశారా.. ఏడాదికి ఎంత ఆదాయం వస్తోందని చంద్రబాబు రైతులను అడిగి

## సీలేరుకు మరింత 'పవర్'

### ఏపీలో రెండో అతిపెద్ద హైడల్ ప్రాజెక్టుగా అవతరణ



అమరావతి, ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : రాష్ట్ర జలవిద్యుత్తు సామర్థ్యం మరో 230 మెగావాట్లు పెరగనుంది. సీలేరు కాంప్లెక్స్‌లో భాగమైన పొల్లూరు (లోయర్ సీలేరు) జల విద్యుత్తు ప్రాజెక్టు ప్రస్తుత సామర్థ్యం 460 మెగావాట్ల (115 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4 యూనిట్లు)కు అదనంగా మరో రెండు యూనిట్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఒక్కోటి 115 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ రెండు యూనిట్లు ఈ ఏడాది అక్టోబరు నాటికి అందుబాటులోకి రానున్నట్లు ఏపీ జెన్‌కో అధికారులు తెలిపారు. ఈ కొత్త యూనిట్లతో లోయర్ సీలేరు జల విద్యుత్తు ప్రాజెక్టు సామర్థ్యం 690 మెగావాట్లకు చేరుతుంది. శ్రీశైలం తర్వాత రాష్ట్రంలో రెండో అతిపెద్ద జల విద్యుత్తు ప్రాజెక్టుగా అవతరిస్తుంది. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ జల విద్యుత్తు ప్రాజెక్టులు సుమారు 1200 మెగావాట్లు (ఏపీవాటా) సామర్థ్యంతో ఉన్నాయి. శ్రీశైలం

## ఇద్దరు బిడ్డలతో సహా దంపతుల ఆత్మహత్య

### వాట్సాప్ స్టేటస్‌లో 'రిప్' మెసేజ్‌తో కుటుంబ సెల్ఫీ

### విశాఖ జిల్లాలో విషాదం.. ఆర్థిక సమస్యలే కారణం?



పెందుర్తి (విశాఖపట్నం జిల్లా), ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : ముక్కుపచ్చలారని ఇద్దరు బిడ్డలతో ఆ దంపతులు అందరితో కలివిడిగానే ఉండే వారు! భర్త రాఖీ పండగకు కుటుంబంతో సహా సొంతూరు వెళ్లి అక్కాచెల్లెళ్లతో రాఖీ కట్టిం చుకుని కానుకలిచ్చారు. తిరిగి ఇంటికి వచ్చాక.. ఏంజరిగిందో ఏమో.. ఇద్దరు బిడ్డలతో కలిసి దంపతులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు ఓ సెల్ఫీ తీసుకుని 'రిప్' అంటూ వాట్సాప్ స్టేటస్‌లో పెట్టి మరీ ప్రాణా లు తీసుకున్నారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలం చింతల అగ్రహారంలో శనివారం తెల్లవా రుజామున ఈ దారుణం వెలుగుచూసింది. (మిగతా 2వ పేజీలో)

## ఏపీలో దారుణం..

### పదేళ్ల జైలు శిక్ష తరవాత ఇంటికి వచ్చి భార్యను చంపిన భర్త



అమరావతి, ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : ఏపీలో దారుణం చోటు చేసుకుంది. పదేళ్ల జైలు శిక్ష అనుభవించిన భర్త తన భార్య కాపురానికి రావడంలేదని హత్య చేశాడు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె మండలం బయ్యారెడ్డి కాలనీలో శనివారం చోటు చేసుకుంది.ఏపీలో దారుణం.. పదేళ్ల జైలు శిక్ష తరవాత ఇంటికి వచ్చి భార్యను చంపిన భర్తదిశ, వెబ్ డెస్క్: ఏపీలో దారుణం చోటు చేసుకుంది. పదేళ్ల జైలు శిక్ష అనుభవించిన భర్త తన భార్య కాపురానికి రావడంలేదని హత్య చేశాడు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె మండలం బయ్యారెడ్డి కాలనీలో శనివారం చోటు చేసుకుంది. తంబళ్లపల్లె మండలం దిగువనపల్లికి చెందిన కె. మధుకర్ రెడ్డి, దండామణి భార్య భర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నేరచరిత్ర ఉన్న మధుకర్ రెడ్డి పదేళ్ల క్రితం జైలుకు వెళ్లాడు. అతడిపై బాంబు దాడి, ఏటీఎం చోరీ, హత్యాయత్నంతో పాటు ఇతర కేసులు ఉన్నాయి. అయితే పదేళ్ల జైలు శిక్ష తరవాత ఇంటికి వచ్చిన మధుకర్ రెడ్డి తన భార్యను కాపురానికి రావాలని కోరాడు. కానీ ఆమె వెళ్లేందుకు నిరాకరించడంతో పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఇటీవల (మిగతా 2వ పేజీలో)

# ప్రజాధనం మురుగుపాలు!

### ఉన్న కాలువలను బాగు చేయకుండా ధ్వంసం

### కొత్త నిర్మాణాల పేరిట కాంట్రాక్టర్ల దందా

### అధికారుల అండతో కాంట్రాక్టర్ల విచ్చలవిడితనం

### ఉన్న ఉన్న కాలువలను బాగు చేయాలి: గ్రామస్తుల డిమాండ్

ఆమదాలవలస,ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలోని 2వ వార్డు కృష్ణాపురం గ్రామంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల దందాతో ప్రజాధనం నీళ్లపాలవుతోంది. గ్రామంలో దశాబ్దాలుగా ఉన్న మురుగు కాలవలు నిర్వహణ లేక తీవ్రంగా పారే మురుగుతో నిండిపోయి, దుర్వాసన వెదజల్లుతుంటే అధికారులు మాత్రం కనీసం ఆ వైపు చూడటం లేదు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న కాలువలను సక్రమంగా నిర్వహించి, చిన్నపాటి మరమ్మతులు చేస్తే సరిపోయే దానికి బదులుగా, ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు కాంట్రాక్టర్లు విచిత్రమైన పథక రచన చేశారు. గ్రామంలో సురక్షితంగా ఉన్న పాత కాలువలను సైతం ధ్వంసం చేస్తూ, కొత్తగా డ్రెయిన్ల నిర్మాణం పేరిట పెద్ద ఎత్తున కాంట్రాక్టు బిల్లులు కాజేసేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నారు. ఏళ్ల తరబడి డ్రెయినేజీ సమస్యతో నరకం అనుభవిస్తున్న ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, ఉన్న నిర్మాణాలను పగలగొట్టి కొత్తవి కడతామనడం అధికారుల అంతర్గత కుమ్మక్కుకు అద్దం పడుతోంది. క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోకుండా, కేవలం నిధుల మంజూరు, కమిషన్ల కోసమే ఈ అతుకుల బొంత కాంట్రాక్టు పనులను ప్రోత్సహిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అండతో కాంట్రాక్టర్ల విచ్చలవిడితనం

గ్రామంలో పారిశుధ్యం పూర్తిగా మృగ్యమై, దోమల వ్యాప్తితో రోగాల బారిన



పడుతున్నామని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయడానికి, చిన్నచిన్న మరమ్మతులు చేపట్టడానికి పైసలు లేవనే మునిసిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు కొత్తగా కాలువలు పగలగొట్టి నిర్మాణాలు చేపడుతుంటే ఎలా నిధులు మంజూరు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. కొత్తగా కాలువలు తవ్వడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతిని కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. పాత కాలువలు పూర్తి సామర్థ్యంతో పనిచేసే అవకాశం ఉన్నప్పటికీ, వాటిని బాగు చేయకుండా పూర్తిగా పగలగొట్టడం వెనుక కాంట్రాక్టర్ల స్వార్థప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపకుండానే ఇలాంటి అనవసరమైన పనులకు అనుమతులు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాధనాన్ని ఈ విధంగా వృథా చేయడం వల్ల నిజమైన అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడుతోందని వార్డు ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

ఉన్న ఉన్న కాలువలను బాగు చేయాలి: గ్రామస్తుల డిమాండ్

ప్రజాధనాన్ని నిష్కారణంగా వృథా చేయకుండా, వెంటనే ఈ పగలుగొట్టే పనులను నిలిపివేయాలని కృష్ణాపురం గ్రామస్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ఉన్న మురుగు కాలువలకే మరమ్మతులు చేపట్టి, పూడికతీత పనులు పూర్తి చేసి, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరుతున్నారు. అనవసరంగా కొత్త కాలువల పేరిట ప్రభుత్వ నిధులను కాంట్రాక్టర్ల జేబుల్లోకి మళ్లించే ప్రయత్నాలను అడ్డుకోవాలని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్న కాలువలను బాగు చేయడానికి తక్కువ ఖర్చవుతుందని, ఆ మిగిలిన నిధులను గ్రామంలోని ఇతర ప్రాథమిక సమస్యలైన వీధిదీపాలు, రోడ్ల నిర్మాణానికి ఉపయోగించాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి కృష్ణాపురం 2వ వార్డులో జరుగుతున్న పనులను తనిఖీ చేసి, కాంట్రాక్టర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసి ప్రజాధనాన్ని కాపాడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలే ధ్యేయం

కాకినాడ,ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ హాలులో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జిజిహెచ్) అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు)లతో కలిసి ఆసుపత్రి అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. తొలుతగా గత సమావేశపు మినిట్స్లో తీసుకున్న చర్యలను సమీక్షించారుఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆసుపత్రికి అవసరమైన నిధులు, పరికరాలు మంజూరు చేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ లావణ్య కుమారి సూచించారు. సెక్యూరిటీ సిబ్బందికి అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు చెల్లించేలా ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని, మెడికల్ విద్యార్థుల పీజీ హాస్టళ్లలో వసతులు మెరుగుపరచాలని తెలిపారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రిలోని మౌలిక వసతులు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత, భద్రత, పారిశుధ్య, సీఆర్ఆర్ సివిల్ పనుల పురోగతిపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రెడ్ క్రాస్ నిధులతో చేపట్టిన క్యాన్సర్ బ్లాక్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, పాత క్రిటికల్ కేర్ బ్లాక్ను తక్షణమే నవీకరించాలని సూచించారు. రోగులకు వీలుగా తూర్పు వైపు ముందుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో మురుగు నీరు నిలవకుండా మూడు అవుట్లెట్ల ద్వారా తరలించి దోమల వ్యాప్తిని అరికట్టాలని, నగర పాలక సంస్థ తరఫున నాలుగు జనరల్ వేస్ట్ డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కిచెన్ సదుపాయాలను అత్యంత పరిశుభ్రంగా నిర్వహించాలన్నారు. పిహెచ్సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఓపి సేవలను బలపరచడం ద్వారా జిజిహెచ్పై భారాన్ని తగ్గించ వచ్చని తెలిపారు. 24ఇ7



ల్యాబ్, ఫార్మసీ, ఐసీయూ సేవలు అందుబాటులో ఉండాలని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి, విశ్రాంత గుండె వ్యాధుల నిపుణుల (కార్డి యాలజిస్ట్) నియమాకానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి స్థలంలో ఆక్రమణలను తొలగించాలన్నారు. అలాగే ప్రహరీ గోడ నిర్మించాలని, పలమనాలజీ బ్లాక్ ఏర్పాటుకు స్థల సేకరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ ఆసుపత్రిలో అభివృద్ధి పనుల వల్ల రోగులకు ఇబ్బంది కలగకుండా సివిల్ పనులన్నింటినీ క్రోడీకరించి ఒకేసారి నిర్వహించాలని సూచించారు. అధునాతన మెడికల్ ఎక్విప్మెంట్ను దశలవారీగా సమకూరుస్తున్నామని, త్వరలోనే పూర్తి స్థాయి క్యాన్సర్ కేర్ బ్లాక్ అందు బాటులోకి రానుందని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె అనిత, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ ఎన్వివి సత్య నారాయణ, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల వైద్యాధికారులు జిల్లా యువజన సంఘ కార్యదర్శి గేదెల శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి.

### మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ.

వేపాడ,ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : మండలంలోని 18 సంవత్సరమునండిన ప్రతి యువకులు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. అదేవిధంగా మండలంలోని ఆకుల సీతంపేట,కేజీపూడి గ్రామాలలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ )పై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సర్ కార్యక్రమంపై ఆదివారం ప్రత్యేక ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.అలాగే 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఫారం-6 ద్వారా తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఫారం-8 ద్వారా తప్పుగా పడిన వివరాలను సరిచేసుకోవడం,ఓటును ఒకచోట నుండి వేరొక చోటుకు బదిలీ చేసుకోవడం వంటి అవకాశాలను ప్రజలు సద్వినియోగపరచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, తహశీల్దార్ రాములమ్మ,పి.ఆర్ ఏ.ఈ ఆలీ, వీఆర్వో అప్పారావు,ఆయా గ్రామాల పెద్దలు,పరవాడ జగదీష్,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### భక్తజన సందోహంతో కిక్కిరిసిన తిరుమల..

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో దర్శనం కోసం వేచి ఉండే సమయం పెరిగింది. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంపట్?క్స్ (ఝఱఅఎబఞ్ఝఎ ాఱబవ జశీఎజూశ్రీవఇ)లోని 20 కంపార్టుమెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి చూస్తున్నారు. మరోవైపు నిన్న ఒక్కరోజే స్వామి వారిని 85,246 మంది భక్తులు దర్శించుకున్నారు. 34,085 మంది భక్తులు తమ తలనీలాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. శనివారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.30 కోట్లు వచ్చినట్లుగా అధికారులు వెల్లడించారు.

## హిందూ రాష్ట్రమంటే ముస్లింలు లేని భారత్ కాదు

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు తనను అడిగిన ఒక ప్రశ్నను భాగవత్ ఈ వేదికగా గుర్తు చేసుకున్నారు. "హిందూ రాష్ట్రం అంటే ముస్లింలకు చోటులేనిదని కాదు. భారత్లో ముస్లింలకు చోటులేదని ఏ హిందువు అయినా భావిస్తే.. అతడు హిందువే కాదు. నీకు నీవు హిందువని చెప్పుకునేట్టు అయితే.. అన్ని మార్గాలూ దేవుడిని చేరుకుంటాయని నీవు విశ్వసించాలి"అని భాగవత్ పేర్కొన్నారు. భారత్లో అందరూ కలసి మెలసి జీవిస్తారని చెబుతూ.. భారత్ అందరికీ నీడనిస్తుందన్నారు.

## సోంపురం జడ్పీ హైస్కూల్లో ఘనంగా

# తెలుగు భాషా దినోత్సవం,జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

వేపాడ,ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం మరియు తెలుగు భాషా దినోత్సవ వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఏ రాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ముందుగా వ్యవహార భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు మరియు హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికార్లు ఎన్.నాగభూషణరావు,పి.బాల భాస్కరరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.క్లస్టర్ ఉపాధ్యాయులు తాతం నాయుడు,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురు పట్టాలు,తెలుగు,వ్యాయామ ఉపాధ్యాయులు వి. జగన్నాథం,ఎస్.గోవిందరావులు ఆయా దినోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు.అలాగే 4వ తరగతి,7వ తరగతి విద్యార్థులు ధ్యాన్ చంద్ మరియు గిడుగు రామ్మూర్తి గురించి మాట్లాడిన ప్రసంగాలు,పాఠశాలలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వ్యాయామ మరియు అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ పి.రమేశ్ నాయుడు,సాంస్కృతిక కార్యక్రమాల ఇంచార్జ్ లు వి.జగన్నాధం,సన్యాసిరావుల పర్యవేక్షణలో సాంస్కృతిక



కార్యక్రమాలు,వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. గోవిందరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన పిరమిడ్స్,కర్ర సాము, సూర్యనమస్కారాలు మొదలైన యోగా,అడ్వెంచర్ కార్య కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.అనంతరం విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది.

## సీలేరుకు మరింత 'పవర్'

(మొదటి పేజీ తరువాయి)

కుడిగట్టుపై ఉన్న జలవిద్యుత్తు ప్రాజెక్టు 770 మెగావాట్ల సామర్థ్యంతో రాష్ట్రంలో అతిపెద్ద జల విద్యుత్తు ప్రాజెక్టు. ఇక పోలవరం జల విద్యుత్తు ప్రాజెక్టు పూర్తయితే 960 మెగావాట్ల సామర్థ్యంతో ఆ ప్రాజెక్టు రాష్ట్రంలో అతిపెద్ద జల విద్యుత్తు ప్రాజెక్టుగా నిలుస్తుంది. పోలవరం జల విద్యుత్తు ప్రాజెక్టులో ఈ ఏడాది చివరికి ట్రయల్ రన్ వేసేందుకు జెన్కో అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇక్కడ విద్యుత్తు ఉత్పత్తి జరగాలంటే పోలవరం ప్రాజెక్టు నీటి మట్టం కనీసం 41.5 అడుగులు ఉండాలి. ప్రస్తుతం ఆ స్థాయిలో ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసే పరిస్థితులు లేనందున ట్రయల్ రన్ మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

### ఏపీలో దారుణం..

### పదేళ్ల జైలు శిక్ష తరవాత ఇంటికి వచ్చి భార్యను చంపిన భర్త

(మొదటి పేజీ తరువాయి)

తన బావమరిదిపై కూడా దాడి చేసి గాయపర్చాడు. ఇక శనివారం ఎవరూలేని సమయంలో ఇంటికి వచ్చిన మధుకర్ రెడ్డి కత్తితో దాడి చేసి భార్యను హత్య చేశాడు. అనంతరం తన బావమరిదికి ఫోన్ చేసి ఇంకా ఇద్దరు మిగిలున్నారు.. వారిని కూడా చంపి నేను చచ్చిపోతా అంటూ వార్నింగ్ ఇచ్చాడు. దీంతో వెంటనే అతడు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అప్రమత్తమై నిందితుడి కోసం మూడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

# గిరిజనులకు అండగా సంజీవని

(మొదటి పేజీ తరువాయి)

అమలు గురించీ అడిగారు. అనంతరం గ్రామస్థులతో ఫొటో దిగారు.

**ఆరోగ్య రథాలు ప్రారంభం**

అల్లూరి జిల్లాకు కేటాయించిన 20 ఆరోగ్య రథాలను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గన్నెల పీహెచ్సీని సందర్శించారు. రక్త నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం డ్రోన్ ద్వారా పాడేరు ఆస్పత్రికి తరలించే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్, గుమ్మిడి సంధ్యారాణి, అరకు, పాడేరు టీడీపీ ఇన్చార్జులు దొన్నుదొర, గిడ్డి ఈశ్వరి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్కుమార్, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్ తదితరులు పాల్గొన్నారు.

**స్థానికంలో అన్నీ గెలవాలి..**

గన్నెలలో అరకు అసెంబ్లీ టీడీపీ నాయకులు, కార్యకర్తలతోనూ సీఎం సమావేశమయ్యారు. సెప్టెంబరు, అక్టోబరుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయని.. అన్ని స్థానాల్లోనూ విజయం సాధించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపిచ్చారు.

## మారికవలస గిరిజన విద్యార్థులను తరలించడాన్ని నిలిపివేయాలి: సీఐటీయూ

విశాఖపట్నం, ,ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : మారికవలసలో గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా కొనసాగుతున్న గురుకుల పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురుకుల పాఠశాల భవనంలో 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' పేరుతో ఐఐటీ ఫౌండేషన్ విద్య అందించేందుకు విద్యార్థులను ఇతర పాఠశాలలకు తరలించే చర్యలను వెంటనే నిలిపివేయాలని కోరింది. ఈ మేరకు శనివారం జగదాంబ జంక్షన్, సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ మీడియాతో మాట్లాడుతూ 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' పేరుతో గిరిజన విద్యార్థులకు అన్యాయం చేయవద్దని అన్నారు. మారికవలసలోని గురుకుల పాఠశాల స్థలం, భవనాన్ని ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలకు, ముఖ్యంగా నారాయణ విద్యాసంస్థలకు అప్పగించాలనే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ను ఏర్పాటు చేయాలనుకుంటే అందుకోసం ప్రత్యేకంగా మరో భవనాన్ని ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం కొనసాగుతున్న గురుకుల పాఠశాలను మూసివేసి విద్యార్థులను బలవంతంగా తరలించడం సరికాదని అన్నారు. పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బలవంతంగా తరలించవద్దని విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా పోలీసులను మోహరించి, విద్యార్థుల సామాన్లను బయటకు విసిరివేసి, వారిని బస్సుల్లోకి బలవంతంగా ఎక్కించడం దుర్మార్గమైన చర్య అని కుమార్ విమర్శించారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడుతున్న కూటమి ప్రభుత్వం గిరిజన విద్యార్థులను విద్యకు దూరం చేసే చర్యలకు పాల్పడటం బాధాకరమని అన్నారు. తక్షణమే మారికవలస గురుకుల పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఇద్దరు బిడ్డలతో సహా దంపతుల ఆత్మహత్య


(మొదటి పేజీ తరువాయి)

పెందుర్తి సీఐ కేవీ సతీశ్కుమార్, మృతులు బంధువుల కథనం ఇలా ఉంది. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మిందివలస సమీప కుమ్మరిపేటకు చెందిన మళ్ల వినోద్కుమార్ (30)కు, పెందుర్తి మండలం చింతల అగ్రహారానికి చెందిన అహల్య (25)కు 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు హితిష (3), హన్విక (ఏడాదిన్నర).

వినోద్ ఆటోడ్రైవర్. ఆర్థిక సమస్యల వల్ల అప్పులు చేశాడు. కొత్తవలసలో అప్పుల భారం అధికం కావడంతో అహల్య తండ్రి పులమరశెట్టి శ్రీను ఏడు నెలల క్రితం అల్లుడు, కూతురిని చింతల అగ్రహారం తీసుకువచ్చారు. అగ్రహారం కాలనీలో అద్దెకు ఉంటున్నారు. మామ ఆర్థిక సహకారం, ఆటో నడపగా వచ్చిన డబ్బుతో ఆనందంగానే జీవనం కొనసాగించేవారు. అహల్య కూరగాయలు విక్రయిస్తుండేది. ఈ క్రమంలో వినోద్కుమార్.. భార్యా పిల్లలతో రాఖీ పండగ జరుపుకొనేందుకు శుక్రవారం కొత్తవలస వెళ్లారు. సాయంత్రం ఇంటికి చేరుకున్నారు.

## కల్లు దుకాణాలు, బెల్ట్ షాపులపై ఎక్సైజ్ దాడులు

విశాఖపట్నం,ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) : మధురవాడ పరిధిలోని కల్లు దుకాణాలు, బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పెందుర్తి ఎక్సైజ్ సీఐ ఎం. సరోజాదేవి పర్యవేక్షణలో, ఎక్సైజ్ సీఐ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. అన్సీజన్లో ప్రమాదకరమైన కల్లు విక్రయిస్తున్నారనే అనుమానంతో అమరావతి కాలనీ కె-1, కె-2, వైఎస్సార్ నగర్, నగరంపాలెం రోడ్డు,



అయోధ్యనగర్, స్వతంత్రనగర్, వాంబే కాలనీ తదితర ప్రాంతాల్లోని కల్లు దుకాణాలు, బెల్ట్ షాపులను అధికారులు తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు నిర్వహించడం, నిబంధనలకు విరుద్ధంగా కల్లు దుకాణాలు నడపడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు ఈ మేరకు హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# 'లక్కీ'లో తెలుగు వెలుగు

విశాఖపట్నం,,ఆగస్టు 29, (ది ఎవిడెన్స్) :దుగు వెంకట రామమూర్తి 163వ జయంతి ఉత్సవాలు విశాఖలో వాడవాడలా ఘనంగా జరిగాయి. 60ఏళ్ల తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ లో వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు అనే అక్షరమాల ఏర్పాటు చేసి తెలుగు భాషపై తమకున్న ప్రేమను చాటుకున్నారు. తెలుగు తల్లి, గిడుగు వెంకటరామ్మూర్తి వేషధారణలతో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్

**తెలుగును ప్రేమిద్దామంటూ విద్యార్థుల నినాదాలు**



ప్రిన్సిపాల్ వందన మాట్లాడుతూ గ్రాంధిక భాషలో ఉన్నటు తెలుగును వాడుక భాషలోకి తీసుకువచ్చిన గిడుగు రామ్మూర్తి జీవిత విశేషాల్ని అందరికీ తెలియజేశారు. తెలుగు భాషజ్ దాని ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు అధ్యాపకురాలు కోమలి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. చివరగా తెలుగును ప్రేమిద్దామంటూ అంతా ప్రతిజ్ఞ చేశారు.

## పాల సేకరణ ధర లీటరుకు రూ3 పెంపు.

**సెప్టెంబర్ 1 నుండి విజయ డైరీ అమలు చేస్తుంది.**



జలుమూరు, ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :ఏపీ: పాల రైతులకు విజయ డైరీ శుభవార్త వెల్లడించింది. పాల సేకరణ ధరను సెప్టెంబర్ 1 నుండి లీటరకు రూ3 పెంచనుంది. రైతుల నుండి లీటరు పాల సేకరణ ధర రూ. 85 నుండి మూడు రూపాయలు పెంచి రూ. 88 కి పెరిగింది. ఈ విషయాన్ని విజయ డైరీ ఎం.డి .ఈశ్వర బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు.

## మాతృ భాష ద్వారానే మానవ విలువలు సాధ్యం

**పేడాడ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు**



టెక్కలి,ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) : మాతృభాష ద్వారా మాత్రమే మానవ విలువలు సాధ్యపడతాయని, మాతృభాషని ప్రేమించడం, కన్న తల్లిని,మాతృదేశాన్ని గౌరవించడం ఉన్నత మానవ విలువల్లో భాగమని పేడాడ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు అన్నారు. టెక్కలి దరి ఇజ్జవరం గ్రామం, పేడాడ విద్యాసంస్థల ఆవరణలో జరిగిన మాతృభాషా దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మానవీయ విలువలు అంతరించిపోతున్నాయని గగ్గోలు పెడుతున్న పాలకులు, కొంతమంది విద్యావంతులు మాతృభాష యెడల చిన్న చూపు చూడటం తగదని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషతో విలువల సాధన,పరభాషను నేర్చడం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రణవి డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయులు రామపాత్రని రామారావు అధ్యక్షత వహించగా, పీబీ దేవి బిఈడి కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ వానపల్లి భోగస్వామి, సర్వోదయ కాన్సెప్ట్ స్కూల్ ఏవో పి.రజిని, ప్రణవి డిగ్రీ కళాశాల దూర విద్యా కేంద్రం సిబ్బంది, ప్రణవి డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సర్వోదయ కాన్సెప్ట్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చలో విజయవాడ ను విజయవంతం చేయండి

**ఏపీ సిపిఎస్ ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి సూరిబాబు**




సంతబొమ్మాలి,ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) : సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఞూబూఞూఞూ )ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ సిపిఎస్ ఇఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి సూరిబాబు అన్నారు. సంతబొమ్మాలి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దండు గోపాలపురం ఆవరణలో శనివారం చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సూరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో లో సంవత్సరం లోపు సిపిఎస్ విధానాన్ని పునః సమీక్షిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రెండు సంవత్సరాల కాలం గడిచిన ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు అన్నారు. పెన్షన్ దయ కాదు... ఉద్యోగికి రాజ్యాంగబద్ధ హక్కు అని అన్నారు. రాష్ట్రంలోని 3.5 లక్షల మంది సిపిఎస్ ఉద్యోగుల ఆకాంక్ష పాత పెన్షన్ విధానం ( డిఫైన్డ్ పెన్షన్ స్కీం )తప్ప మరే ప్రత్యామ్నాయం సరికాదు అని తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరి ప్రసాద్, నరసింహమూర్తి రాజులు, ఎల్వి రమణ, మధుబాబు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ' గిడుగు ' అధ్యయన కేంద్రం ఏదీ?

**జయంతి వేడుకలు ఏవీ?**

**జర్నలిస్ట్ సంఘాల ఆవేదన**



శ్రీకాకుళం ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు పేరుతో అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు గతంలో కొందరు వైస్ ఛాన్సలర్లు ఇచ్చిన హామీ ఏమైందని వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రశ్నించారు. శనివారం ఉదయం స్థానిక డే అండ్ నైట్ రోడ్ జంక్షన్, నాగావళి తీరంలో గల గిడుగు విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన జయంతి సందర్భంగా వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా, జర్నలిస్ట్ సంఘాల నాయకుడు, ప్రముఖ రచయిత నల్లి ధర్మారావు మాట్లాడుతూ, గిడుగు వారి సేవలను గుర్తు చేశారు. వాడుక భాషనే అధికారిక భాషగా ప్రభుత్వాలు గుర్తించాలన్న ఆయన పోరాటం, ఆయన మరణానంతరం ఫలించిందని చెప్పారు. వాడుక భాష కోసమే కాకుండా, ప్రాచీన ఆదివాసీ తెగ సవరల అక్షరాస్యతకు ఎంతో కృషి చేశారని తెలిపారు. శ్రీముఖలింగం శాసనాలను వెలుగులోకి తెచ్చి, కళింగ చరిత్రకు ప్రాణం పోసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని గుర్తు చేశారు. ఒరిస్సా రాష్ట్రం ఏర్పడినప్పుడు, తెలుగువారు అత్యధికంగా నివసించే పట్నాలు, గ్రామాలను ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలోనే కొనసాగించాలని పోరాడినట్టు వివరించారు. భాష, చరిత్ర, ప్రత్యేక రాష్ట్రం, సవరల విద్యాభివృద్ధికి కృషి చేసిన రామమూర్తి చతుర్ముఖుడని కొనియాడారు. ఈ నాలుగు అంశాలను కొత్త తరం విద్యార్థులు అధ్యయనం చేయడానికి వీలుగా, అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో గిడుగు పేరుతో కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిడుగు జయంతిని కూడా అధికార కార్యక్రమంగా, అన్ని జిల్లాలలోనూ నిర్వహించాలని కోరారు. ఇటువంటి మహనీయుడి జన్మస్థలం శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండలంలోని పర్వతాలపేట అగ్రహారం కావడం గర్వకారణమన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పైడి బాలకృష్ణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొదలవలస వాసు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిలర్ కుంచి.చిన్నారావు, స్వామ్నా జిల్లా అధ్యక్షులు సున్నపు చిన్నారావు, ఫోటో జర్నలిస్టుల యూనియన్ జిల్లా కన్వీనర్ శ్యామ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సీనియర్ జర్నలిస్టులు పురుషోత్తం రాంబాబు, చరణ్, బాలకృష్ణ, సూర్య, జె సి ఐ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## దండుగోపాలపురంలో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు




సంతబొమ్మాలి, ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :సంతబొమ్మాలి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు ముడిదాన రాము, సంపతిరావు, మురళీధరరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు బూరవల్లి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తెలుగు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గతంలో తెలుగు భాష గ్రాంధికంగా ఉండటంతో సాహిత్యం, గ్రంథాలు ప్రధానంగా పండితులకే పరిమితమయ్యేవని తెలిపారు. ఈ పరిస్థితిని గమనించిన గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషను సామాన్య ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో వ్యవహారిక భాషా ఉద్యమాన్ని ప్రారంభించారని వివరించారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషికి గుర్తుగా ఆయన జయంతిని రాష్ట్రంలో తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా భారత హాకీ క్రీడకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన మహోన్నత క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని ఉపాధ్యాయులు కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వ్యాయామ ఉపాధ్యాయుడు బూరవల్లి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులకు శతక పద్యాలు, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె. శ్రీనివాసరావు, సూర్యప్రకాష్, నాగేశ్వరరావు, బి. శ్రీనివాసరావు, అన్నాజీ, లక్ష్మీనారాయణ, డి. శ్రీనివాసరావు, దయాసాగర్, శ్రీధర్, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు

### మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషితో

# జిల్లాలో రహదారులకు కొత్త వెలుగు

**33.20 కి.మీ. మేర రోడ్ల అభివృద్ధికి రూ.55.70 కోట్లు**

**శ్రీకాకుళం జిల్లాలో రూ.55.70 కోట్లతో రోడ్ల విస్తరణ, అభివృద్ధి**



కోటబొమ్మాలి,ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :శ్రీకాకుళం జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. టెక్కలి, నరసన్నపేట సహా, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో దెబ్బతిన్న కీలక రహదారుల పునర్నిర్మాణానికి భారీగా నిధులు తీసుకురావడంలో ఆయన విజయం సాధించారు. మంత్రి అచ్చెన్నాయుడు నిరంతర కృషి, పట్టుదలతో ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా ముందస్తు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

డోల–పోలాకి–నౌపడ రహదారికి పూర్వవైభవం

జిల్లాలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన డోల–పోలాకి–నౌపడ రహదారి విస్తరణ, బలోపేతం పనులకు నిధులు కేటాయించారు.

ఈ పనులను రెండు విభాగాలుగా చేపడుతున్నారు:

మొదటి విడత (నరసన్నపేట/శ్రీకాకుళం పరిధి) 13.00 కిలోమీటర్ల పరిధిలోని రహదారి పనులకు రూ. 25.20 కోట్లు మంజూరయ్యాయి.రెండో విడత (టెక్కలి/శ్రీకాకుళం పరిధి) 20.20 కిలోమీటర్ల పరిధిలోని రోడ్డు పనులకు రూ. 30.50 కోట్లు కేటాయించారు. కేంద్ర రహదారుల నిధి (సి ఆర్ ఐ ఎఫ్) స్కీమ్ ద్వారా ఈ ముఖ్యమైన రహదారుల పనులకు మంత్రి అచ్చన్న నాయుడు జీవో విడుదల కు కృషి చేశారు.ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే తీరప్రాంత గిరిజన, మత్స్యకార గ్రామాలతో పాటు నరసన్నపేట, టెక్కలి, నౌపడ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థ మెరుగవుతుందని, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు స్థానిక వ్యాపార, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఊతం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు.

## ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో రజతోత్సవ వేడుకలు




టెక్కలి, ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) : టెక్కలి సమీపం లోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో 'హ్యాక్‌స్ప్రింట్–-2.0' పేరుతో 24 గంటల జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను కళాశాలలో నిర్వహించి నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం డైరెక్టర్ ప్రొఫెసర్ జి. జయసుమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సాంకేతిక ఆవిష్కరణల పోటీలలో వివిధ కళాశాలలకు చెందిన 113 బృందాలు పాల్గొన్నాయి. వీటిలో ఐతం కళాశాలకు చెందినవి 40, ఇతర కళాశాలలకు చెందినవి 73 బృందాలు ఉన్నాయి. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక ఆలోచనలను వినియోగించి వివిధ సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందించారు. వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థలకు చెందిన నలుగురు నిపుణులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించి విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు , ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎస్ఈ విభాగాధిపతి డా. వై. రమేష్ కన్వీనర్‌గా, ప్రొఫెసర్లు డా. ఎం. జయంతి రావు, డా. జి. రామకృష్ణ కో–కన్వీనర్లుగా వ్యవహరించారు.విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యాలనుపెంపొందించడమే లక్ష్యంగా హ్యాకథాన్‌ను నిర్వహించినట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు.

## సంతబొమ్మాలి గ్రంథాలయంలో గిడుగు జయంతి వేడుకలు



సంతబొమ్మాలి, ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :సంతబొమ్మాలి మండల కేంద్రం లోని శాఖ గ్రంథాలయంలో తెలుగు భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి 163 వ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి గ్రంథాలయ అధికారి కే రామకృష్ణ నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యవహార భాషలో సాగి అందరికీ అందుబాటు లోకి వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బాబురావు, ఎంపీపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు

## సీతానగరంలో పైప్‌లైన్ పనులను అడ్డుకున్న మహిళలు



సంతబొమ్మాలి, ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతి సీతానగరం గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ పనులను గ్రామానికి చెందిన మహిళలు శనివారం అడ్డుకున్నారు. మూలపేట పోర్టు ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి సీతానగరం గ్రామం మీదుగా తాగునీటి పైప్‌లైన్లు వేస్తుండగా మహిళలు అడ్డుపడి పనులను నిలిపివేశారు. మేము రెండేళ్లుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అయినా ఎవరూ పట్టించుకోలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తాగునీరు అందించకుండా మా గ్రామం మీదుగా పైప్‌లైన్లు వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ పైప్‌లైన్ ద్వారా మాకు కూడా తాగునీటి కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు నీటి సౌకర్యం కల్పించే వరకు పనులు జరగనివ్వబోమని వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు పనులు నిలిచిపోయాయి. ఇంతలో జనసేన కార్యకర్త ఎల్. కుమార్ వచ్చి పైపులైను పనులను అడ్డుకున్న మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించమని వస్తే మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేస్తావా అంటూ జనసేన కార్యకర్తపై మహిళలు మండిపడ్డారు. ఇంతలో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మహిళలతో మాట్లాడి పైప్‌లైన్ పనులు కొనసాగించారు. త్రాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరారు.

## యామలపేట లో ఘనంగా మాతృభాషా దినోత్సవం



సంతబొమ్మాలి, ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) : సంతబొమ్మాలి మండలం యామలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం, మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువు ఉపాధ్యాయులకు సన్మానించారు.జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థుల విద్యార్థులకు స్పోర్ట్స్ క్విజ్ , స్పోర్ట్స్ పై వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నడిమింటి నాగరాజు, తెలుగు ఉపాధ్యాయురాలు కె.లక్ష్మి , ఉపాధ్యాయులు ఆది కేశవరెడ్డి సత్యవతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేయించండి.

**ఐవిఆర్ కాల్స్ గురించి లబ్ధిదారులకు వివరించండి.**



సారవకోట, ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :మండలంలో సెప్టెంబర్ ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు సక్రమంగా అందే విధంగా చూడాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ కార్యదర్శులు దేనని ఎంపీడీవో లు మురళీ మనోహర్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో అనురాధలు ఆదేశించారు. శనివారం ఎంపీడీవోకార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారులకు ఐ వి ఆర్ ఫోన్ కాల్స్ అధికారుల నుండిరానున్నాయి. ఆ కాల్స్ విషయం పింఛన్ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని వీ రు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో డిప్యూటీ ఎంపీడీవో గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## హానికర పరిశ్రమలకు మా భూములు ఇవ్వం

### కెమికల్ పార్క్ భూసేకరణ గ్రామసభలో రైతులు, మత్స్యకారుల స్పష్టీకరణ



సంతబొమ్మాళి, ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) : కెమికల్ పార్క్ నిర్మాణం కోసం తమ భూములను సేకరించడాన్ని రైతులు, మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకించారు. తమ భూములు కోల్పోవడంతో పాటు కెమికల్ పరిశ్రమల వల్ల ఆరోగ్యాలు, పర్యావరణం దెబ్బతినే ప్రమాదం ఉందని, అలాంటి పరిశ్రమల కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు.కెమికల్ పార్క్ అవసరమైన భూసేకరణపై శనివారం సంతబొమ్మాళి మండలం వడ్డితాంద్ర సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, మత్స్యకారులు తమ అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కెమికల్ పార్క్ ఏర్పాటైతే తమ సంప్రదాయ జీవనోపాధి దెబ్బతింటుందని, ముఖ్యంగా మత్స్యకారుల జీవనంపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఇతర పరిశ్రమలైతే ఆలోచిస్తాం : కెమికల్ పరిశ్రమల ఏర్పాటు కోసం తమ భూములను సేకరిస్తే అంగీకరించబోమని కొంతమంది రైతులు స్పష్టం చేశారు. అయితే ప్రాంత అభివృద్ధికి దోహదపడే ఇతర పరిశ్రమలు వస్తే భూములు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.కెమికల్ పార్క్ కాంప్లెక్స్ ఏర్పాటుకు సుమారు 3 వేల ఎకరాల భూమి అవసరమని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా వడ్డితాంద్ర రెవెన్యూ పరిధిలో సుమారు 500 ఎకరాల భూమిని సేకరించే ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. గ్రామసభలో రైతులు, మత్స్యకారులు లేవనెత్తిన సమస్యలు, అభ్యంతరాలను ఆర్డీవో కృష్ణమూర్తి విన్నారు. కెమికల్ పార్క్ ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియకు అందరూ సహకరించాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మరోసారి గ్రామసభ నిర్వహిస్తామని చెప్పారు.ఈ గ్రామసభలో తహసీల్దార్ హేమసుందర్‌రావు, రెవెన్యూ అధికారులు, రైతులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డిపోల్లో "క్యూఆర్ కోడ్" విధానశీ ఆలోచనను విరమించుకోవాలి

కోటబొమ్మాలిఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :: రేషన్ డిపోల్లో క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేసే యోచన ను ప్రభుత్వం విరమించుకోవాలని కోటబొమ్మాళి మండలానికి చెందిన రేషన్ డీలర్లు శనివారం తాహసిల్దార్ సి.హెచ్.ఎస్. వి. కే. ప్రసాద్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే డీలర్లకు సంబంధించి పలు సమస్యలు వినతి పత్రంలో పేర్కొన్నారు. తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో కోరారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో డీలర్లకు చాలిచాలని కమిషన తో పంపిణీ చేస్తున్నా, మళ్లీ అదనంగా ఈ క్యూఆర్ కోడ్ విధానం పెట్టడం వల్ల చాలా ఇబ్బందికి గురవుతామని, ప్రతి బస్తా స్కాన్ చేసి ఇవ్వడం సాధ్యపడదు అని అన్నారు. సాంకేతిక లోపం వలన పంపిణీ ఆలస్యం జరుగుతుందని తెలిపారు. ఇప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్ విధానం అమలు చేస్తే నెట్వర్క్ అంతంత మాత్రమే ఉన్న గ్రామాలలో సాంకేతిక లోపం వలన క్యూఆర్ కోడ్ స్కాన్ అవ్వకపోతే రేషన్ కి వచ్చిన వినియోగదారులు గంటల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇటువంటి విషయాలను ప్రభుత్వ యంత్రాంగం పునరాలోచించాలని వారు కోరారు. అలాగే డీలర్లకు జీతాలు లేవు సరి కదా, అదనంగా డిపోలో ఒక హమాలీని పెట్టుకోవాల్సి వస్తుందన్నారు. అది తమకు అదనపు



భారమేనన్నారు. అలాగే మళ్లీ ఈ కొత్త విధానం వల్ల డీలర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, ముఖ్యంగా డీలర్ కు అసౌకర్యంగా ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఇలాంటి క్యూఆర్ కోడ్ విధానం అమలు చేయ వద్దని, అలాగే డీలర్లు కమిషన్ పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో మండల డీలర్ల సంఘం నేతలు దుద్ది దానయ్య, సుంకరి రాము, మోహన్, మల్లేష్, చింతల సింహచలం, ఆనందరావు తో పాటు పలువురు డీలర్లు ఉన్నారు. దీనిపై స్పందించిన తాసిల్దార్ ప్రసాదరావు ఈ వినపత్రాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని స్పష్టం చేశారు.

## ఏపీ ఫ్ బ్ల్యూజే అనకాపల్లి జిల్లా యూనిట్‌కు రాష్ట్ర యూనిట్ అభినందనలు..



అనకాపల్లి ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అనకాపల్లి జిల్లా యూనిట్ తమ సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి, సంబంధిత సభ్యత్వ వివరాలను శనివారం లేబర్ కమిషనర్‌కు అందజేయడం పట్ల రాష్ట్ర యూనిట్ హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా యూనిట్ సభ్యులను హృదయపూర్వకంగా అభినందించింది.సంస్థ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తూ, కేవలం 15 రోజుల వ్యవధిలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన జాతీయ కౌన్సిల్ సభ్యులు రుద్ర కు రాష్ట్ర యూనిట్ ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేసింది.అనకాపల్లి జిల్లా యూనిట్ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర యూనిట్ కోరింది.భవిష్యత్తులో జిల్లా యూనిట్‌లోని ప్రతి సభ్యుడు ఐకమత్యంతో, సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్ర యూనియన్ సూచనలు, ఆదేశాలను పాటిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర యూనిట్ విజ్ఞప్తి చేసింది.అనకాపల్లి జిల్లా యూనిట్ చేసిన ఈ కృషి రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లా యూనిట్లకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షిస్తూ, జిల్లా యూనిట్‌కు రాష్ట్ర యూనిట్ మరోసారి అభినందనలు, ధన్యవాదాలు తెలియజేసింది.

## రేషన్ షాపుల్లో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని రద్దు చేయాలి.

పలాస,ఆగస్టు ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :పభుత్వము కొత్తగా ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ అమలు వల్ల రేషన్ డీలర్లు ఆందోళనలు వ్యక్తము చేస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో నీ వజ్రపు కొత్తూరు మండలం రేషన్ డీలర్లు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు . శనివారం రేషన్ డీలర్లు క్యూ ఆర్ కోడ్ అమలును నిలిపి వేయాలని కోరుతూ ఇక్కడ వినతి పత్రము ఇచ్చారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సెప్టెంబరు నెల నుండి రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసే 10 శాతం బ్రోకెన్ రైస్ బియ్యం బస్తాలపై నూతనంగా క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ చేయనున్నట్లు రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేయడంతో రేషన్ డీలర్లు నిరసన బాట పట్టారు .ఇక్కడ తహసల్దార్ కు వెళ్లి వినతి పత్రం సమర్పించారు..రేషన్ డీలర్లలో చాలా మందికి ఇప్పటికీ ఆండ్రాయిడ్ మొబైల్స్ అందుబాటులో లేకపోవడం, ఈ స్కానింగ్ చేసే సమయంలో యాప్ ను డౌన్లోడ్ చేసుకునే పరిస్థితి లేదని ,తమరికి విన్నవించుకొనుచున్నామని , అలాగే ఇదే సమయంలో మండల లెవెల్ స్టాక్ పాయింట్లనందు క్యూఆర్ కోడ్ నమోదు చేయు అంశాన్ని ప్రవేశపెట్టడం.జరగలేదని, పూర్తి అనుభవం ఉన్న ఉద్యోగస్తులు, అధిక సంఖ్యలో హమాలీలు అందుబాటులో

### స్థానిక తహసల్దార్ సీతారాం
### వినతి పత్రము ఇచ్చిన డీలర్లు సంఘం



ఉన్న మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో కూడా క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ అనేది ప్రవేశపెట్టకపోవడం వలన, రేషన్ డీలర్లకు ఇప్పటికే ఎన్నో దశాబ్దాల నుండి వచ్చుచున్న తరగతుల సమస్యను ఇప్పటికీ పరిష్కారం చేయకపోగా ఆ తరగతులను కూడా అధికారికంగా రేషన్ డీలర్లను మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న తప్పులకు బాధ్యులంతను చేయటం డీలర్లను తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందనీ తెలిపారు. తమకు న్యాయము చేయాలని తహసీల్దార్ ను కోరిన ఇక్కడ డీలర్లు సంఘము నేతలు కోనేరు కామేశ్వర రావు, తవితటయ్య, గోవింద తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఎస్టి కమిషన్ చైర్మన్ కి పిల్లల వ్యాక్సిను అందుబాటులో ఉండాలని వినతి

కొయ్యూరు ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) ::అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలంలో గల 12 పంచాయతీల కొండగోకిరి, రత్నంపేట, కినపర్తి, రావణపల్లి, నల్లగొండ, అంతడా, బంగారం పేట, బట్టపనుకులు, నడింపాలెం, వెలగలపాలెం, శరభన్నపాలెం మొదలగునవి వ్యాక్సిన్ అందుబాటులో లేదు ప్రస్తుతం కొయ్యూరు నుండి పంపిణీ చేస్తున్నారు. దాన్ని కేడి పేట ౯ాఎజ కి మార్చినట్లయితే వ్యాక్షన్ ప్రజలకు అందుబాటులో వస్తుంది, మునుపు కేడీ పేట లోనే ఉండేది. జిల్లాలు మారినందు వల్ల ఈ వ్యాక్సిన్౯ాఎజ లో ఇవ్వటం వల్ల మాకు సమస్యగా ఉంది. తగిన సమయానికి వ్యాక్సిన్ వేయటానికి సమయం సరిపోవటా లేదు, కావున యధావిధిగా కేడీ పేట లో వ్యాక్షన్ అందుబాటులో తీసుకో రావాలని కమిషనర్ గారికి కోరుతూ అలాగే 12 పంచాయతీల ప్రజల ఆరోగ్య పరిస్థితి వాళ్ళ యొక్క బాగోగులు బాగుండాలనీ పి హెచ్ సి అందుబాటులో ఉండాలని మరొక్కసారి ౹ా కమిషనర్ గారికి కోరడమైనది.ఈ కార్యక్రమంలో బీజేపీ కొయ్యూరు మండల అధ్యక్షులు సంపరీ శివకుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు, జనజాతీయ సురక్ష మంచ్ రాష్ట్ర అధ్యక్షులు డీవీడీ ప్రసాద్, గుర్రం సునీల్ పాల్గొన్నారు.



## ఫిలిం ఫ్యాషన్ అండ్ డిజైన్ స్కూల్ ఘనంగా ప్రారంభం

ఉమ్మడి వరంగల్ జిల్లా (ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :హనుమకొండ, హనుమకొండ సుబేదారి ఫారెస్ట్ ఆఫీసు ఎదురుగా జీకేఆర్ ఎంటర్టైన్మెంట్స్ ఫ్యాషన్ అండ్ ఫిలిం అడమిన్నీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అల్లుడు కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రారంభించారు. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూవరంగల్ సుబేదారిలో తొలిసారిగా ప్రారంభమైన జీకేఆర్ ఎంటర్టైన్మెంట్స్ ఫ్యాషన్ అండ్ ఫిలిం అకాడమీ ఫౌండర్ గద్దల రాజేష్ కో ఫౌండర్



గొర్రె ఐశ్వర్య లకు శుభాకాంక్షలు తెలిపి, వారి వ్యాపారాలు విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు ఐశ్వర్య రాజేష్ లు మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా వరంగల్ లోని హనుమకొండ కాజీపేట ప్రాంతంలో ఫిలిమ్స్ కోచింగ్ సెంటర్ ను ప్రారంభించడానికి ఎంతో సంతోషంగా ఉందని ఈ కోచింగ్ సెంటర్ ద్వారా ఫ్యాషన్ డిజైన్, బాడీ అండ్ మేకప్, మాడ్రన్ ఫిలిం క్లాసెస్ యాక్టింగ్ క్లాసెస్ ఫోటోగ్రఫీ సర్వీసెస్ అందిస్తామని ఈ అవకాశాన్ని వరంగల్ లో ఉండే యాక్టింగ్ పై ఆసక్తి ఉన్న యువతీ, యువకులు, పిల్లలు, పెద్దలు అందరూ వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గద్దెల కేశవరావు (జి ఆర్ కె), గద్దల శాంత, గొర్రె అనిత ప్రసాద్, పాల్సన్ కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### పార్టీలకు అతీతంగా ఉత్సవాలు
### హనుమకొండ కాళోజీ కళాక్షేత్రం వేదికగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబరాలు

ఉమ్మడి వరంగల్ జిల్లా ఆగస్టు 29 , (ది ఎవిడెన్స్) :యాదవ సంస్కృతీ, సంప్రదాయాలు తెలిపేలా కార్యక్రమాలు,యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ వెల్లడిగొల్ల,కురుమల సమక్షంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ, ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా ప్రముఖులు తరలిరానున్నారని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్ లోని బీసీ భవన్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్ ను గొల్ల, కురుమలతో కలిసి సుందర్ రాజ్ యాదవ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈసారి కూడా అత్యంత వైభంగా ఉత్సవాలు జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా శ్రీకృష్ణుని భజనలు జరుగుతున్నాయని, భగవద్గీత ప్రపంచానికే మార్గదర్శిగా మారిందని గుర్తు చేశారు. సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా యాదవుల సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,




మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పార్టీలకు అతీతంగా హాజరవుతారన్నారు. ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 4న మధ్యాహ్నం 2గంటలకు రాంనగర్ లోని బీసీ భవన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు రథయాత్ర జరుగుతుందని, అనంతరం పవిత్రమైన గోపూజ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఆ తరువాత శ్రీకృష్ణ భగవానుడికి తొట్లు ఊపే కార్యక్రమం ఉంటుందని, యాదవ సంస్కృతికి అద్దం పట్టేలా సంబరాలు జరుగుతాయన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే కళాకారులతో ఆటాపాట, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యాదవులను ఏకం చేసి రాబోయే రోజుల్లో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని సుందర్ రాజ్ యాదవ్ వివరించారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు...ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, తోట్ల రాజు యాదవ్, యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రవీంద్ర కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు కత్తుల సహదేవ్ యాదవ్, కార్యదర్శి తుత్తురు రవీందర్ యాదవ్, కోశాధికారి చిన్నాల రవీందర్ యాదవ్, అఖిలభారత యాదవ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొల్లెబోయిన కిషోర్ యాదవ్,అఖిలభారత యాదవ మహాసభ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ముగలా కుమార్ యాదవ్, యాదవ మహిళ నాయకురాలు లలిత యాదవ్,కనకరాజు యాదవ్, ఇదుల మల్లయ్య యాదవ్ దూడయ్య యాదవ్, చెన్నమల్లు యాదవ్, పెద్దబోయిన నాగరాజు, ప్రమోద్ యాదవ్, యుగేశీధర్ యాదవ్ వంశీ యాదవ్ , కోటి యాదవ్,కందుల జీవన్ యాదవ్,రమేష్ యాదవ్, హరిప్రసాద్ యాదవ్, రాణా యాదవ్, పోతరబోయిన రాజయ్య, యశ్వంత్ యాదవ్, నన్నెబోయిన రాజ్ యాదవ్, వేల్పుల సాయి యాదవ్ పాల్గొన్నారు.

Published By : G. Srinivasa Rao. Printed by Harsha Vardhana. J at The Evidence Press, 4-72-4, Second Floor, Shalom House, Beach Road, Lawsons Bay Colony, Visakhapatnam - 530017,A.P, INDIA. T/AP/2025/1017/2082/1372. Contact : +91 9966850202, +91 9885485277.
epaper.theevidencetelugu.in, theevidencedhinapathrika@gmail.com